ప్రజాశక్తి
ఆదివారం 17 మార్చి 2024 5
శ్రీ సత్యసాయి

'లెక్కా'..పత్రం తప్పనిసరి..!

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగదు, బంగారు తదితర వాటి రవాణాపై ఆంక్షలు అమల్లోకి వస్తాయి. ఈ విషయంలో సామాన్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అధికారులు ఎక్కడికక్కడ నిరంతరం తనిఖీలు చేస్తుంటారు. రూ.50వేలకు మించి డబ్బు లభిస్తే వాటికి సంబంధించిన వివరాలను కచ్చితంగా అధికారులకు చూపించాలి. లేకుంటే ఆ డబ్బును సీజ్ చేస్తారు.

నగదుతో పాటు బంగారం, వెండి కొనుగోలు చేసినా రసీదులు తప్పనిసరి. కొనుగోలు అమ్మకాలు, ఆస్పత్రుల బిల్లులు, చెల్లింపులు ఇలా ప్రతి దానికి సబంధించిన ఆధార పత్రాలు ఉంటేనే చేతిలో నగదును పట్టుకుని బయటకు వెళ్లాలి. సామాన్య జనం అంతా ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు

నగారా మోగే.. కోడ్ కూసే..!

- ఇక అంతా మాజీలే..!
- మే 13న పోలింగ్ ◆ జూన్ 4న కౌంటింగ్
- ఉమ్మడి జిల్లాలో మొదలైన రాజకీయవేడి
- ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రకటన
- నేటి నుంచి ఊపందుకోనున్న ప్రచారం
- ఎన్నికల నిర్వహణలో అధికారులు బిజీబిజీ

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్నికల నగరా మోగింది. రాష్ట్రంలో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పచ్చ జెండా ఊపుతూ షెడ్యూల్ ప్రకటించింది. ఈ ప్రకటనతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్కసారిగా ఎన్నికల వాతావరణం మారిపోయింది. రాజకీయ పార్టీల నాయకులు ప్రచార పనుల్లో తలమునకలు కాగా, అధికారులు పకడ్బందీగా ఎన్నికల నిర్వహించే దానిపై నిమగ్నం అయ్యారు. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించిన స్థానాల్లో ప్రచారాలు జరుగుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నేటి నుంచి ప్రచార వేడి మరింత పెరగనుంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికల నగార మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. నాలుగో దశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నట్టు ప్రకటించింది. ఇప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తున్నట్టు తెలిపింది. దీంతో ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా కొనసాగిన వారు తాజా మాజీలు కానున్నారు. రాష్ట్రమంతటా ఒకేసారి ఎన్నికలు కావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగో దశలోనే పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో శనివారం నుంచి ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల హోర్డింగ్‌లు, ప్రకటనలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డుల తొలగింపు ప్రక్రియ ఆరంభం అయ్యింది. ఎన్నిల ప్రక్రియ పారదర్శకంగా సాగేలా అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. ఇక రాజకీయ పార్టీలు గెలుపే లక్ష్యంగా అస్త్రశస్త్రాల ఎన్నికల రణరంగంలోకి దూకనున్నారు.

ఏప్రిల్ 18న నోటిఫికేషన్

ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటన మేరకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడనుంది. అప్పటి నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి ఉంటుంది. ఏప్రిల్ 25వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అప్పటి నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ పూర్తవుతుంది. అప్పటి నుంచి ప్రచారాలు ప్రారంభమై మే 11వ తేదీ సాయంత్రంతో ప్రచారాలు ముగుస్తాయి. మే 13వ తేదీ పోలింగ్ జరగనుంది. జూన్ 4వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనుంది.

అమల్లోకి ఎన్నికల కోడ్

ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల సంఘం తెలిపింది. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, పొటోలను తొలగించాలని సూచించింది. అదే విధంగా ఆన్‌లైన్‌లో ఉన్న మంత్రులు ముఖ్యమంత్రుల చిత్రాలను తొలగించాలని

పోలింగ్ కేంద్రాలు
అనంతపురం జిల్లా : 2,213
శ్రీసత్యసాయి జిల్లా : 1571

పేర్కొంది. రాజకీయపరమైన కార్యక్రమాల్లో అధికారులు ఎవరైనా పాల్గొంటే చట్టపరమైన చర్యలుంటాయని కూడా హెచ్చరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ఎన్నికల నియమావళిని పూర్తి స్థాయిలో అమలు చేయడంపై దృష్టి సారించారు. ఇప్పటికే పలు దఫాలుగా రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన అధికారులు ఎన్నికల నియమావళిని తెలియజేసేందుకు కూడా సమావేశం నిర్వహించి విధి విధానాలను తెలియజేస్తారు. ఎన్నికల ప్రచారం, సమయపాలన, అభ్యర్థుల పెట్టే ఖర్చు తదితర అన్నీ కూడా ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలి. నియమావళిని అతిక్రమించే అభ్యర్థులపై పోటీ నుంచి అనర్హత పడే అవకాశం ఉంది. ఇక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే రోజు నుంచే ఆయన వ్యయం లెక్కింపు చేస్తారు. అభ్యర్థి ఇందుకోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరిచి ఆ ఖాతా నుంచే ఎన్నికల వ్యయం లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది.

ఎన్నికలకు సంబంధించి ముఖ్యమైన రోజులు

- ఏప్రిల్ -18-25: నామినేషన్ల స్వీకరణ
- ఏప్రిల్ -29: నామినేషన్ల ఉపసంహరణ
- మే -13: పోలింగ్ తేది
- జూన్ -4: ఓట్ల లెక్కింపు..ఫలితాలు

శ్రీ సత్యసాయి జిల్లా ఓటర్ల వివరాలు

	హిందూపురం	మడకశిర	పెనుకొండ	ధర్మవరం	కదిరి	పుట్టపర్తి
పురుషులు	1,23,974	1,06,242	1,17,310	1,19,086	1,23,742	1.04.092
మహిళలు	1,22,471	1,04,831	1,16,369	1,20,451	1,27,027	1.05.970
ఇతరులు	18	01	03	20	07	14
మొత్తం ఓటర్లు	2,46,463	2,11,074	2,33,682	2,39,557	2,50,776	2.10.076

అనంతపురం జిల్లా ఓటర్ల వివరాలు

	అనంతపురం అర్బన్	శింగనమల	తాడిపత్రి	ఉరవకొండ	కళ్యాణదుర్గం	రాయదుర్గం	గుంతకల్లు	రాప్తాడు
పురుషులు	136761	122341	121499	109905	113196	1 29090	131304	124081
మహిళలు	141679	123257	122562	112788	114236	131736	135656	124219
ఇతరులు	35	27	24	30	07	33	76	13
మొత్తం ఓటర్లు	278475	245625	244075	222723	227438	260859	267036	248313

చదువు, సంస్కారంతో సమాజ వికాసం

పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎం.శ్రీధర్, ఏపీ హైకోర్టు జడ్జి శ్రీనివాసలు రెడ్డి

పద్మశ్రీ అవార్డు గ్రహీత మకాం శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఏపీ హైకోర్టు జడ్జి శ్రీనివాసలు రెడ్డి తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

చదువు, జ్ఞానం, సంస్కారంతో సమాజం వికసిస్తుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత మకాం శ్రీధర్, ఏపీ హైకోర్టు జడ్జి శ్రీనివాసలు రెడ్డి, ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు మాజీ డీన్ ప్రొఫెసర్ యడాటి నరహరిలు తెలియజేశారు. శనివారం స్థానిక ఎస్‌డిజిఎస్ కళాశాలలో 1979-76లో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థి పద్మశ్రీ అవార్డు గ్రహీత మకాం శ్రీధర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల పూర్వ విద్యార్థులు ఏపీ హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ యడాటి నరహరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మకాం శ్రీధర్ మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు రాకముందు, వచ్చినప్పుడు తనలో పెద్దగా తేడా ఏమీ రాలేదన్నారు. తాను ఇదే కళాశాలలో చదువుకున్నాని, హిందూపురం విద్యను మరింత అభివద్ధి చేయాలని ఉందన్నారు. బెంగళూరులోని చాణక్య యూనివర్శిటి విద్యాప్రణాళికలో ఎస్‌డిజిఎస్ కళాశాలను ఆహ్వానిస్తున్నాయని అన్నారు. ప్రొఫెసర్ నరహరి మాట్లాడుతూ విద్యా సంస్థలు ఎల్లప్పుడు కళకళలాడుతుండాలని ఆకాంక్షించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకోవడం, ప్రయ త్నించడం, చేరుకోవడం ఎంతో అవసరమన్నారు. కష్టాలు, బాధలు ఏవీ లెక్కచేయ కుండా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిట్టా పార్థసారథి, విద్యాసాగర్, జేపీకే రాము, శ్రీధర్, కళాశాల ప్రెసిడెంట్ చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రాంప్రసాద్, జేఎస్వీఎస్ ప్రసాద్, నాగేంద్రకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలయ్యకు బుద్ధి చెబుదాం : వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యలను విస్మరించి సినిమా షూటింగ్‌ల్లో తిరుగుతున్న బాలకృష్ణకు వచ్చే ఎన్నికల్లో ఓటుతో తగిన బద్ధి చెప్పాలని వైసిపి నాయకులు వేణురెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నాడు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 4వ వార్డు శివాలయం వీదిలో నూతనంగా రూ.40లక్షలతో నిర్మాణం చేస్తున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. కొట్నూరులో శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. ఇతర పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలకృష్ణ హిందూపురం అభివృద్ధికి చేసింది శూన్యం అన్నారు. ఇలాంటి వ్యక్తిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు దాదు, లక్ష్మీ. మహేష్ గౌడ్, కింగ్ షఫీ, ముస్తాక్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, ఎస్సీ సెల్ క్లస్టర్ 1 కన్వీనర్ అంబేద్కర్ నగర్ నవీన్, నాయకులు మహమ్మద్ ఇసాక్, నరసింహమూర్తి, మూర్తి, నాగరాజు, గోపి రహమతుల్లా పాల్గొన్నారు.

భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న వేణురెడ్డి, చైర్‌పర్సన్ ఇంద్రజ

వైసిపి జట్టు సిద్ధం..!

- పూర్తి స్థాయి జాబితా విడుదల
- ఆఖరి జాబితాలో అంతా సిట్టింగ్‌లకే అవకాశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అనేక విడతలుగా అభ్యర్థులు ప్రకటిస్తూ వచ్చింది. తాజాగా శనివారం విడుదల చేసిన జాబితాతో పూర్తి స్థాయి అభ్యర్థులను ప్రకటించింది. అంతకు మునుపు వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించింది. ఆఖరి జాబితాలో మిగిలిన ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. పాతవారితో కలిపి మొత్తం జాబితాను మరోమారు ప్రకటించింది. దీంతో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరుపున బరిలో దిగే అభ్యర్థులెవరన్న లెక్కి తేలింది. ఆఖరు జాబితాలో ఎటువంటటి మార్పుల్లేకుండా సిట్టింగులకే చోటు కల్పించింది.

శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి అభ్యర్థులు

మక్బుల్ బాషా (కదిరి)
కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి (ధర్మవరం)
దీపిక (హిందూపురం)
ఈరలక్కప్ప (మడకశిర)
దద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (పుట్టపర్తి)
ఉషశ్రీ చరణ్ (పెనుకొండ)

పార్లమెంట్ అభ్యర్థులు



శంకర నారాయణ (అనంతపురం)
శాంతమ్మ (హిందూపురం)

అనంతపురం జిల్లా వైసిపి అభ్యర్థులు

అనంత వెంకటరామిరెడ్డి (అనంతపురం అర్బన్)
వై.వెంకట రామిరెడ్డి (గుంతకల్లు)
తలారి రంగయ్య (కళ్యాణదుర్గం)
మెట్టు గోవిందరెడ్డి (రాయదుర్గం)
తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (రాప్తాడు)
కేతిరెడ్డి పెద్దారెడ్డి (తాడిపత్రి)
వై. విశ్వేశ్వరరెడ్డి (ఉరవకొండ)
వీరాంజి నేయులు (శింగనమల)

అసెంబ్లీ బరిలో నిలిచే వైసిపి అభ్యర్థులు వీరే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో అన్ని స్థానాలకు వైసిపి అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభ్యర్థిగా అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లుకు వై.వెంకటరామిరెడ్డి, తాడిపత్రికి పెద్దారెడ్డి, ఉరవకొండకు వై.విశ్వేశ్వరరెడ్డి, దర్మవరానికి కేతిరెడ్డి వెంకటరావమిరెడ్డి, రాప్తాడుకు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, పుట్టపర్తికి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్లను ప్రకటించారు. వీరిలో విశ్వేశ్వరరెడ్డి ఉరవకొండ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా ఉండగా, మిగిలిన వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఇక అంతకు మునుపు సమన్వయకర్తలుగా ప్రకటించిన శింగనమలకు వీరాంజినేయులు, కళ్యాణదుర్గంకు తలారి రంగయ్య, పెనుకొండ ఉషచరణ్ శ్రీ, హిందూపురం దీపిక, మడకశిర ఈరలక్కప్ప, కదిరి మక్బుల్ బాషాలను అభ్యర్థులుగా ప్రకటించారు. ఇక పార్లమెంటుకు స్థానాలకు సంబంధించి అనంతపురానికి శంకర నారాయణ, హిందూపురానికి శాంతమ్మ పేర్లు ప్రకటించారు.

వైసిపి తరుపున తేలిపోయిన అభ్యర్థులు

వైసిపి సార్వత్రిక ఎన్నికలకు పూర్తి స్థాయి అభ్యర్థులు తెలారు. ఇన్ని రోజులు పోటీలో నిలిచేదెవరన్న దానిపై కొన్ని నియోజకవర్గాల్లో సస్పెన్స్ నడుస్తూ వచ్చింది. శనివారం నాడు అధిష్టానం అన్ని స్థానాలపై స్పష్టతను ఇచ్చేసింది. ప్రతిపక్ష టిడిపిలోనే ఇంకా రెండు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. అనంతపురం అర్బన్, గుంతకల్లు నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులెవరన్నది ఇంకా ప్రకటించలేదు. అదే విధంగా పార్లమెంట్ అభ్యర్థులు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నారు. వైసిపి మాత్రం ఎన్నికల షెడ్యూల్ వెలువడే సమయానికి అభ్యర్థులను ప్రకటించి పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యింది.

మెగా లోక్‌అదాలత్‌లో 124 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-హిందూపురం

రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ఎంతో ఉత్తమమని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ తెలిపారు. శనివారం నాడు స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన మెగాలోక్ అదాలత్‌లో 124 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతు కక్షిదారులు లోక్ అదాలత్‌ను ఉపయోగించుకుని కేసులను పరిష్కరించుకోవలని సూచించారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమం అన్నారు. లోక్ అదాలత్ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో కక్షిదారులు, న్యాయవాదులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, లోక్ అదాలత్ సభ్యులు సిద్ధా, కళావతి, పార్వతి, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సుదర్శన్ నాగరాజు రెడ్డి, కేశవరెడ్డి, రఘునాథ రెడ్డి, ఈశ్వరప్ప, లోక్‌అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారం పై చర్చిస్తున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

'పది' విద్యార్థులకు బస్సు ప్రయాణం ఉచితం

పుట్టపర్తి క్రైమ్ : ఈ నెల 18వ తేదీ నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు వారి ఒరిజినల్ హాల్ టికెట్లను పల్లె వెలుగు బస్సుల్లో కండక్టర్‌కు చూపించి పరీక్షా కేంద్రాల వద్దకు ప్రయాణం చేయవచ్చు న్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో రాకపో కలకు ఉచితంగా ప్రయాణ సదు పాయం కల్పించినట్లు తెలియజేశారు.

మక్బుల్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపాల్టీలోని పలు వీధుల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాక్బుల్ శనివారం నాడు విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి ఓటు అభ్యర్థించారు. తెల్లవారుజామున విధులకు హాజరవుతున్న మున్సిపల్ కార్మికులను ఆయన కలిశారు. మున్సిపల్ కార్మికులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ ప్రచారంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు పరికి సాధిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న మక్బుల్

పేదలకు న్యాయం చేసేంత వరకూ పోరాటం

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి-సోమందేపల్లి

పేదలు, గిరిజనులు గుడిసెలు వేసుకున్న స్థలాల్లో వారికి హక్కులు కల్పించేంత వరకూ పోరా టం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యా లయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. పెద్దన్న మాట్లాడుతూ మండలంలోని వెలగమాకలపల్లి తండా గిరిజన కుటుంబాలు పునరావాసం కల్పించాలని, వెలగమాకలపల్లి, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం పలుమార్లు విజ్ఞప్తుల చేసినా ఫలితం లేదన్నారు. గుడిపల్లి పొలంలోని బీడు భూముల్లో వందలాది మంది పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని వీరందరికీ హక్కుల కల్పించాలని వ్యకాసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పేదలు తహశీల్దార్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. సోమందేపల్లి, గుడిపల్లి రెవెన్యూ పరిధిలో బీడు భూమిని 1975-భూ పరిమితుల చట్టం కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దళిత, గిరిజన, బలహీన వర్గాలు, భూమిలేదని పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్పందించి తహశీల్దార్ మాట్లాడుతూ ఆయా అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, కల్లుగీత కార్మిక సంఘం మండల నాయకులు రామకష్ణ, సిపిఎం సభ్యులు మాబు, గంగరాజు, శ్రీకాంత్, వందలాది మంది గిరిజనులు, పేదలు పాల్గొన్నారు.

వ్యకాసం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పేదలు

వినియోగదారుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

విద్యుత్ సిజిఎం గురువయ్య

పరిగి-ప్రజాశక్తి

మండలంలో విద్యుత్ వినియో గదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిజిఎం గురువయ్య ఆదేశించారు. ఆయన శనివా రం పరిగి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి యూనిట్ కొనుగోలుపై రూ. 10 ఖర్చు చేస్తుందని, అలాంటి విద్యుత్‌ను అవసరానికి మాత్రమే వినియోగించేలా వినియోగదారులు, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యాలయ పరిధిలో ఉన్న విద్యుద్దీకరణలో భాగంగా ఎక్కువ శాతం విద్యుత్ వృథా చేస్తున్నారని అలాంటి ప్రాంతాలను గుర్తించి అవగాహన కల్పించి, నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయంలో వినియోగించే ప్రతి రికార్డును ఉంచాలన్నారు. ప్రతి ఉద్యోగి పని తీరు మెరుగుపరుచు కోవాలని, లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట భూపతి రాజు, ఎఇ మొయిద్దీన్ ఉన్నారు.

విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న సిజిఎం గురువయ్య

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షాలకు సంబంధించి కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులూ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 115 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. చాలా కేంద్రాల్లో మౌలిక వసతులు లేవన్నారు. ఫ్యాన్లు, బెంచీలు లేవన్నారు. వెలుతురు సమస్య కూడా ఉందన్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అనువుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. జిల్లాలో కొన్ని కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు ఫీజులు కట్టలేదన్న సాకుతూ హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, హర్ష కుమార్, పవన్, భగత్, మహేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

రెడీమేడ్, గార్మెంట్స్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో నూతనంగా ఏర్పాటైన రెడీమేడ్, గార్మెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం పట్టణంలోని రోటరీ క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా వైసిపి నాయకులు వేణరెడ్డి పాల్గొని నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించా రు. అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ అసోసి యేషన్ వారికి ఎళవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తనవంతు సాయం అంది స్తానన్నారు.హిందూపురం రెడీమేడ్ అండ్ గార్మెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షులుగా షాజహాన్, ప్రధాన కార్యదర్శిగా సిద్దిక్, కోశాధికారిగా జొన్న ప్రసాద్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, ఉప కార్యదర్శిగా భరత్, ఉపకోశాధికారిగా సయ్యద్ ఫయాజ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు కార్యక్రమంలో రామ్మూర్తి, బేరింగ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న వేణురెడ్డి తదితరులు

'ఓపెన్' పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పది, ఇంటర్ ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ ను అరికట్టాలని కోరుతూ శనివారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్‌జాన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శేషం మహేం ద్ర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ నిర్వాహకులు గ్యారెంటీగా పాస్ చేయిస్తామని నమ్మ బలికి ఒక్కో విద్యార్థి నుంచి రూ. 12 వేల నుంచి రూ. 15 వేల వరకూ వసూలు చేస్తున్నార న్నారు. రూ. 1000 ఇస్తేనే హాల్ టికెట్ ఇస్తామంటూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వాటిని అరికట్టాలని లేనిచో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బైఠాయించి మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించే కోఆర్డినేటర్స్‌ని తరిమి కొడతామని హెచ్చరించారు. వినతి ఇచ్చిన వారిలో తరుణ్, తేజ్, జశ్వంత్, మహేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

రాక్షస పాలన నుంచి విముక్తి : కందికుంట

కదిరి టౌన్ : జాతీయ ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడం ద్వారా రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ నుంచి ప్రజలకు విముక్తి లభించిందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎపిలో అన్ని వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకొని పరిపాలన సాగిస్తున్న జగన్‌కు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అధికారులు, పోలీసులకు జగన్ కబంధహస్తాల నుంచి స్వేచ్ఛ లభించిందన్నారు. ఎన్నికల్లో వైసిపిని పాతాళంలోకి తొక్కడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయనతో పాటు గంగయ్య నాయుడు, డైమండ్ ఇర్ఫాన్ ఉన్నారు.

రాష్ట్ర, జనహితం కోసమే పొత్తు

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపందుకే రాష్ట్ర అభివృద్ధి ప్రజల ఆకాంక్ష మేరకు టిడిపి, బిజెపి, జనసేనపార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని కందికుంట స్పష్టం చేశారు. తనపై కొందరు గ్లోబల్ ప్రచారం చేస్తరని ప్రజలు విజ్ఞతతో ఆలోచన చేసి కందికుంట యశోదదేవిని గెలిపించాలని కోరారు. విషం నింపే కార్యక్రమాలు చేస్తున్న వారిని ముస్లిం సామాజిక వర్గం తిప్పి కొడుతుందని గుర్తు చేశారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో సాధారణ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి ఎన్నికల నిర్వహణపై మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు దగ్గరగా ఉన్న కర్నాటక సరిహద్దు ప్రాంతాలోల అక్రమ మద్యం, నగదు, డ్రగ్, ఆయుధాలు, తదితర వాటి తరలింపు పట్ల జిల్లా సరిహద్దుల్లో గట్టిగా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహిస్తామని వారు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, డిఆర్ఒ కొండయ్య, సిపిఒ విజయ్‌కుమార్, డ్వామా పిడి విజయప్రసాద్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా, డిఎంహెచ్ఒ ఎస్వీ కృష్ణారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు : డిఆర్ఒ

ఎన్నికల్లో విభిన్న ప్రతిభావంతులు ఓటు వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని డిఆర్ఒ కొండయ్య తెలి పారు. 'స్వీప్'లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు ఓటు హక్కు ప్రాధాన్యతతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వీప్ మోడల్ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. డిఆర్ఒ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేయవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల కోసం ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. నడవలేని వారికి మూడు చక్రాల కుర్చీ అందు బాటులో ఉంటుందన్నారు. నడవలేని స్థితిలో ఉన్నవారు స్థానిక ఎన్నికల అధికారికి ఫారం-డి సమర్పిస్తే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పిస్తామన్నారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యత తెలిపే ప్రచార గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల హక్కుల సంక్షేమ నాయ కులు రామాంజనేయులు, ధనుంజయ, భూదేవి, రాధాబాయి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ కొండయ్య

ధర్మవరంలో తెలుగుతమ్ముళ్ల నిరసన ప్రదర్శన

పొత్తుకు వ్యతిరేకం కాదు.. అభ్యర్థికి మాత్రమే.. పరిటాల శ్రీరామ్ శ్రమకు గుర్తింపు ఇదేనా..?

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం టిడిపి టికెట్ పరిటాల శ్రీరామ్‌కు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో శనివారం తెలుగు తమ్ముళ్లు, పరిటాల అభిమానులు కదం తొక్కారు. నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు, పరిటాల అభి మానులు వేలాది సంఖ్యలో స్థానిక కాలేజ్ సర్కిల్‌కు చేరుకున్నారు. నిరసన ప్రదర్శనగా కళాజ్యోతి, అంజుమన్, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదు గా గాంధీసర్కిల్ చేరుకుని సూరి మాకొద్దు అంటూ నినాదాలతో హోరెత్తించారు. వారు మాట్లాడుతూ సూరి ఎమ్మెల్యేగా ఉన్న సమయం లో కార్యకర్తలను పట్టించుకోకపోయినా 2019 ఎన్నికల్లో సహకరించామన్నారు. ఓడిపోయిన కొద్ది రోజులకే నమ్ముకున్న మమ్మల్ని వదిలేసి బిజెపిలో చేరాడన్నారు. ఆ సమయంలో అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకే పరిటాల శ్రీరామ్ ఇక్కడికి వచ్చి కార్యకర్తలకు అండగా ఉంటూ ధర్మవరంలో పార్టీకి ఊపిరి పోశాడన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిచే పరిస్థితికి తీసుకొచ్చిన పరిటాల శ్రీరామ్ శ్రమను అధిష్టానం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. పొత్తులో భాగంగా టికెట్ బిజెపికి ఇస్తామంటే అడ్డుపడమని, కానీ సూరికి ఇస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమన్నారు. సూరికే టికెట్ ఇస్తే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామన్నారు.

ధర్మవరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఎంపి టికెట్ రాకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా : 'నిమ్మల'

ప్రజాశక్తి-గోరంట్ల

హిందూపురం ఎంపిగానైనా అవకాశం ఇవ్వాలని టిడిపి అధిష్టానాన్ని కోరానని టికెట్ ఇవ్వకపోతే మద్దతుదారులతో చర్చించి భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తానని మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప తెలిపారు. పట్టణంలోని తన నివాసం వద్ద శనివారం ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావే శం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి అధిష్టానానికి విధేయుడిగా పని చేశానన్నారు. పుట్టపర్తి టికెట్‌ను బిసిలకు కేటాయిస్తామని అధిష్టానం పలు సందర్భాల్లో పేర్కొన డంతో తనకు కేటాయించాలని కోరానన్నారు. ఐవిఆర్ సర్వేలో కూ డా తనవైపే ఎక్కువ శాతం నియోజకవర్గ ఓటర్లు మొగ్గు చూపార న్నారు. కనీసం హిందూపురం ఎంపిగానైనా అవకాశం ఇవ్వాలని కోరానని టికెట్ ఇవ్వకపోతే పార్టీకి రాజీనామా చేయాలా లేక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలా అనే విషయం వెల్లడిస్తాన న్నారు. కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ అధిష్టానం టికెట్ కేటాయించక పోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ మరో సారి తన అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని, సానుకూలంగా స్పందించకపోతే కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, మాజీ జెడ్పిటిసి గఫూర్, నాయకులు అల్లా బకాష్, హంపయ్య, సుబ్రహ్మణ్యం, ఎల్ఎన్.నారాయణస్వామి, శ్రీనివాసులు, కిష్టప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మల కిష్టప్ప

సునీల్‌కుమార్ సమక్షంలో టిడిపిలో భారీగా చేరిక

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ప్రారంభించిన టిడిపి నూతన కార్యాలయంలో శనివారం వైసీపీ నుండి 300 మంది నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టిడిపి అభ్యర్థి సునీల్ కుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. మండలంలోని చందకచెర్లకు చెందిన దేవ్లానాయక్, మాజీ ఎంపీపీ బొజ్జప్ప ఆధ్వర్యంలో 300 మంది ఆ గ్రామం నుంచి ఊరేగింపుగా వచ్చి పట్టణంలోని ఆలయంలో పూజలు నిర్వహించి టిడిపిలో చేరారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ అరాచకాలను సహించలేక అభివృద్ధికి మారుపేరైన చంద్రబాబు విధానాలకు ఆకర్షితులై టిడిపిలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అశ్వర్థామప్ప, ఆదినారాయణ, ఉగ్రనరసింహప్ప, హనుమంతరాయప్ప, భోజన్న, ప్రకాష్, క్రిష్టప్ప, టీడీపల్లి మంజునాథ్, రమేష్ పాల్గొన్నారు.

ఈరన్న, సునీల్‌కుమార్ సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

పట్టణంలోని పెనుకొండ రోడ్డులో టిడిపి నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే ఈరన్న, అభ్యర్థి సునీల్ కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రోజురోజుకూ టిడిపికి ఆదరణ పెరుగుతోందని, ప్రతి మండలంలో వైసిపి నుంచి టిడిపిలోకి చేరుతున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి భారీ మెజార్టీ సాధిస్తుందని తెలిపారు.

కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న టూటౌన్ సిఐ అశోక్ కుమార్

కేంద్ర సాయుధ బలగాల కవాతు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు, ఎన్నికల్లో ప్రజలకు అండగా ఉన్నామని చెప్పేందుకు పోలీసుల కవాతు నిర్వహించినట్లు టూటౌన్ సిఐ అశోక్‌కుమార్ తెలి పారు. పట్టణంలో శనివారం సాయంత్రం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు నిర్వహిం చారు. సిఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరిం చాలని కోరారు. కేంద్ర సాయుధ బలగాలు నిరంతరం నిఘా పెడతారని తెలిపారు. కవాతులో బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ గౌతమ్‌కుమార్, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నాయి.

అమిదాలగొందికి 'పది' పరీక్ష కేంద్రం

మడకశిర : విద్యాశాఖ ఉన్నతాధికారులు మండలంలోని అమిదాలగొంది జడ్పీ హైస్కూల్‌ను పదో తరగతి పరీక్ష కేంద్రంగా ఎంపిక చేసినట్లు హెచ్ఎం జాబేజ్‌దర్శి తెలిపారు. గతంలో పని చేసిన హెచ్ఎం విశ్వనాథ్, ఎంపీపీ కవితా సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పేస్వామి చొరవతో పరీక్ష కేంద్రం మంజూరైనట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు.

నేరాలు ఘోరాలు

పాత కక్షలతో వ్యక్తి హత్య

నల్లమాడ : పాత కక్షలతో ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటన మండలంలోని సోమగుట్టపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. అంజన్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి దయాదులు. డబ్బుల లావా దేవీల విషయంలో శుక్రవారం అంజన్‌రెడ్డి స్కూటీని నాగేంద్రరెడ్డి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వారి మధ్య జరిగిన ఘర్షణలో అంజన్‌రెడ్డి స్వల్పంగా గాయపడి నల్లమాడలో ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొంది తిరిగి స్వగ్రామం వెళు ండగా దారిలో నాగేంద్రరెడ్డి, అతడి కుటుంబ సభ్యులు అంజన్ రెడ్డిపై దాడి చేయ డంతో స్పృహ తప్పి పడిపోయాడు. అజంన్‌రెడ్డిని బంధువులు నల్లమాడ ఏరియా ఆస్పత్రికి తరలించిగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితులు పరారీలో ఉన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ : మండలంలోని సంకేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ముక్తాపురం గ్రామానికి చెందిన తండ్రీ, కుమారులు బాలాజీనాయక్, మనోజ్ నాయక్‌లకు గాయాల య్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహనం సంఘటనా స్థలానికి చేరుకుని వారిని బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి..

రొద్దం : ఎన్ టు డే న్యూస్ ఛానల్ రిపోర్టర్ నరసింహమూర్తి శుక్ర వారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డాడు. వివరాలు.. నరసింహమూర్తి పెనుకొండ నుంచి రొద్దంకు ద్విచక్ర వాహ నంపై వెళ్తుండగా పెద్ద కోడిపల్లి గ్రామ సమీపంలోని అక్కమ్మ గార్ల ఆలయం వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు.

రైతుపై మూకుమ్మడి దాడి

మడకశిర : రొళ్లలో శనివారం రైతు శివన్నపై కొందరు మూకుమ్మడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. అగళి మండలం బీరనపల్లి గ్రామానికి చెందిన శివన్న రొళ్లలో భూమి కొనుగోలు చేశాడు. అయితే కొందరు వ్యక్తులు ఆ భూమిలో తమకూ వాటా ఉందని తరచూ శివన్నతో గొడవ పడుతూ ఉండడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివన్న శనివారం ఒక్కడే పొలంలో ఉండగా కాపు కాచిన ఐదుగురు వ్యక్తులు శివన్న చేతులు, కాళ్లు కట్టేసి దాడి చేశారు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు పొలానికి చేరుకుని శివన్నను మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పల్లె సింధూరకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మండ లంలోని కొట్లపల్లి, నిడిమామిడి పంచాయతీలోని కొత్త నిడిమామిడి, దండువారిపల్లి, కత్తివారి పల్లి, గాజులపల్లి, గాజులపల్లితండా గ్రామాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. పల్లె సింధూ ర, పల్లె వెంకటకృష్ణకిషోర్‌రెడ్డి ముందుగా కొత్త నిడిమామిడి గ్రామంలో నిడిమామిడమ్మ ఆలయంలో వారు పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కొట్లపల్లి గ్రామం వద్ద తెలుగు యువత నాయకుడు కంసల నారాయణస్వామి ఆధ్వర్యంలో మహిళలు పూలమాలలు వేసి హారతులు పట్టి పల్లె సింధూరరెడ్డికి ఘన స్వాగతం పలికారు. సింధూర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేస్తామన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తారని, బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, కార్మికులకు, రైతులకు మంచి చేకూరుతుందన్నారు. టిడిపిని గెలిపించాలని కోరారు. వారి వెంట నాయకులు రూరల్ మండల కన్వీనర్ విజయ్‌కుమార్, శ్రీరామ్‌నాయక్, పెద్దప్పయ్య, నాగిరెడ్డి, రంగప్ప, మెహర్ అలీ, అక్రంబాషా, పుల్లప్ప, నాగరాజు, బొమ్మయ్య ఉన్నారు.

మహిళలకు కరపత్రాలు ఇస్తున్న పల్లె సింధూర

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం

పెనుకొండ : నియోజకవర్గ అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని మడకశిర రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ పనులను శనివారం ఆమె పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య వ్యవస్థ బలోపేతం చేయడమే లక్ష్యంగా సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పెనుకొండ పట్టణంలో 63 ఎకరాల స్థలంలో రూ. 475 కోట్ల వ్యయంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మిస్తున్నా రన్నారు. ఆమెతో పాటు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఉమర్ ఫరూక్, వైస్ ఛైర్మన్లు సునీల్, జయశంకర్‌రెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, గణేష్, బోయ బాబు, సద్దాం, రామాంజి, కిష్ట, నాయకులు కొండల రాయుడు, ఆంజనేయులు, చండా నాయక్ పాల్గొన్నారు. పట్టణంలోని గోల్డెన్ ఎంపైర్ ఫంక్షన్ హాలులో శనివారం మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో పట్టణానికి చెందిన 250 కుటుంబాలు టీడీపీ పార్టీని వీడి వైసిపిలో చేరాయి. వారికి మంత్రి వైసిపి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సునీల్, కౌన్సి లర్లు సుధాకర్, తయూబ్, బోయ బాబు, శ్రీరాములు, సద్దాం, రామాంజి, టౌన్ కన్వీనర్ నరసింహా, సింగిల్‌విండో అధ్యక్షులు సూర్యప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : వైసీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన కురుబల అభ్యున్నతికి కృషి చేసిందని ఉషశ్రీచరణ్ వెల్లడించారు. మండలంలోని పైడేటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మండలంలోని కురుబ కులస్తులతో నిర్వహించిన ఆత్మీయ కలయికలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లా డుతూ కురుబలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. వారి ఎదుగుదలకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ సీనియర్ నేత డివి రమణప్రభాకర్ ఆమెను సన్మానించారు.

ఎన్ని 'కలల్లో'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐదేళ్లకు ఒకసారి జరిగేవి కేవలం ఎన్నికలు ఓట్లు వేయడం వరకే కాదు.. ఈ ఎన్నికల్లో ఎన్నుకునే ప్రభుత్వాలు, అవి సాగించే పాలన ఎంతో ముఖ్యం. ఎందుకంటే మనిషి జీవితం రాజకీయాల తో ముడిపడి ఉంటాయి. ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికార పగ్గాలు చేపట్టాక ఆ ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు మనిషి జీవితంపై ఎంతగానో ప్రభావం చూపుతుంటాయి. ఎన్నికల సమయంలో అందరూ ప్రజలకు ఎంతో మేలు చేస్తామంటు వాగ్దానాలు, హామీలివ్వడం, అమలు చేసే సమయం లో అందుకు భిన్నంగా ఉండటం వంటివి జరుగు తూ ఉంటాయి. అందుకే ప్రజాస్వామ్యంలో మనిషి ఓటుకు ఎంతో విలువ ఉంటుంది. ఆ ఓటే మనిషి జీవితాన్ని శాసిస్తోందన్నది సత్యం. దీని కోసమే ఆయా రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల సమయం లో అనేక హామీల్విడంమే కాకుండా ప్రజలను ఊహాల్లోనూ, కలల్లోనూ విహరింపజేసే ప్రకటనలు చేస్తుంటాయి. ఆ తర్వాత గద్దెనెక్కాక ప్రజలపై భారా లు వేస్తుంటాయి. ఇప్పుడు జరుగతున్న రాజకీయా ల్లో సంక్షేమ పథకాల చుట్టూ నడుస్తున్నాయి. అభివృద్ధి, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం వంటి అంశాలు పెద్దగా చర్చకు రావడం లేదు. గడిచిన ఐదేళ్లలో ఇప్పటికీ ఉద్యోగ భర్తీలు పూర్తి స్థాయిలో చేపట్టలేదు. దీంతో నిరుద్యోగం పెరిగిపోయింది. ఎన్నికలు సమీస్తున్న సమయంలో నోటిఫికేషన్‌లు విడుదల చేసి హడావుడి చేయడం మినహా పూర్తి చేసే పరిస్థితి లేదు. మరోవైపు అభివృద్ధి పనులు 'ఎక్కడ వేసిన గొంగళి' అన్న చందంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సిపిఎం జిల్లా అభివృద్ధి ప్రణాళిక ఈ ఎన్నికల్లో ప్రధాన అంశం కావాలని కోరుతున్నారు. ఈ మేరకు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులందరికీ సమగ్రాభి వృద్ధిపై చర్చించాలని, ఎన్నికల్లో ఆ అంశాన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయ త్నం చేసింది. అభివృద్ధి ప్రణాళికను అందజేసింది. అయితే ఈ దీనిపై ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపిలు ఏ మేరకు స్పందిస్తాయ న్నది చూడాల్సి ఉంది. ఎన్నికల్లో ఇచ్చే హామీల్లాగానే ఉంటాయా లేక ఈ అంశాలే చర్చ రాకుండా ఇతర వాటిపై రాజకీయాలు మల్లుతాయా లన్నది చూడా ల్సి ఉంది. శనివారం నాటితో ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైంది. ఇక ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చినట్టయింది. అయితే రాష్ట్రం నాలుగో విడత పోలింగ్‌లో ఉండటంతో వచ్చేనెల 18న నోటిఫికేషన్ రానుంది. అధికార యంత్రాంగం ఇప్పటికే ఎన్నికలకు సమయత్తమవుతోంది. ఇక రాజకీయ పార్టీలు మరింత వేగంగా పావులు కదుపుతున్నాయి. అధికార వైసిపి అభ్యర్థులందరినీ ప్రకటించింది. టిడిపి ఇంకా రెండు స్థానాలతోపాటు, పార్లమెంటు స్థానాలకు ప్రకటించాల్సి ఉంది.

టిడిపిలో ఇంకా అసంతృప్తులు కొనసాగుతున్నాయి. వాటిని అధిష్టానం ఏ మేరకు సర్దుబాటు చేయగలుగుతుందో చూడాల్సి ఉంది. ప్రజలు మాత్రం ఏ పార్టీ తమ భవిష్యత్‌ను మార్చగలిగే విధంగా కృషి చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే సాగు,తాగునీటికష్టాలు తీరడం లేదు. గడిచిన మూడేళ్లుగా కొంత వరకు వర్షాలు పడినప్పటికీ 2023 సంవత్సరంలో వర్షాభావం నెలకొంది. ఎప్పటిలాగానే ఈ ఏడాది కరువు నెలకొనడంతో రైతులు నష్టాలను చవిచూశారు. పంటల్లేక వలసలు పోతున్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపే పాలకులు ఈసారైన రావాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. ఈ ఎన్నికల సమయంలోనైనా నేతలు ఈ అంశాలపై దృష్టి సారించి ఎటువంటి పరిష్కారాలు చూపుతామని హామీలిస్తారో చూడాల్సి ఉంది.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు

చిలమత్తూరు : ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ మేరకు చిలమత్తూరులో రాజకీయ నాయకుల విగ్రహాలకు పంచాయతీ అధికారులు ముసుగు వేశారు. 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ప్రచార కార్యకలాపాలకు సంబంధిచిన బ్యానర్లు, ఫొటోలు తొలిగిస్తామని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సభ్యులు తెలిపారు. మండల వ్యాప్తంగా 41,847 మంది ఓటర్లు ఉండగా 52 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ భాగ్యలత తెలిపారు. పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన కోడూరు, చిలమత్తూరులో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి.

విగ్రహానికి ముసుగు వేసిన పంచాయతీ అధికారులు

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

జయంతి సభలో వక్తలు

ధర్మవరం, హిందూపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

ప్రజాశక్తి-ధర్మవరం

పొట్టి శ్రీరాములు సేవలు, ప్రాణత్యాగం మరువలేనివని ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు అంబటి అవినాష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెనుజూరి నాగరాజు తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. ఆయన నిరాహార దీక్ష కారణంగానే ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో కలవల రఘు, దేవతా శ్రీనివాస్, రేగంటిరెడ్డి, వంశీరాం పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో..

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు త్యాగం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయులు పొట్టిశ్రీరాములు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కాచర్ల కంచెన్న, బీరే గోపాలకృష్ణ పేర్కొన్నారు. టిడిపి ఆధ్వర్యంలో వారు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్‌చౌదరి, భీమనేని ప్రసాద్‌నాయుడు, అంబటి సనత్, మేకల రామాం జనేయులు, కేశగాళ్ళ శీన, కత్తుల బాబ్జి, పుల్లప్ప రవీంద్ర, టైలర్ గోపాల్ పాల్గొన్నారు. స్థానిక కెఎస్‌హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, స్వామి, పుష్పావతి, ఆనంద్, సరస్వతి, సౌజన్య పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని ఏఆర్ డిఎస్పీ విజయకుమార్, ఎ.సుజాత తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలులో ఎఆర్, డిపిఒ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు చంద్రశేఖర్, రవికుమార్, సూపరింటెండెంట్ సరస్వతి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం : తెలుగు రాష్ట్రం కోసం ఆసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైసిపి నాయకులు వేణురెడ్డిలు నివాళి అర్పించారు. చిన్నమార్కెట్ వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి శ్రీకాంత్, రవీంద్రుడు, ఎన్ఆర్.రాఘవేంద్ర, విష్ణు తదితరులు పాల్గొన్నారు. వైసిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వైసిపిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఒడిసిలో పల్లె సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఏపి ప్రజలకు రాక్షస పాలన నుంచి విముక్తి లభించిందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పల్లె శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపికి బై బై చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సొంత చెల్లి షర్మిల, మరో సోదరి సునీత వైసిపికి ఓటు వేయవద్దని ప్రజలను కోరుతు న్నారంటే జగన్ అరాచకం, విధ్వంసం, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యం ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుం దన్నారు.

17 కుటుంబాలు టిడిపిలోకి చేరిక

ఓబుళదేవరచెరువు : మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో వణుకువారిపల్లికి చెందిన 17 వైసిపి కుటుంబాలు టిడిపి చేరాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్లె మండలంలోని టీకుంట్లపల్లిలో పర్యటించగా రమాదేవి, లక్ష్మమ్మ, బి.సురేష్, అనిత, శివప్రసాద్, గౌతమి, మునెమ్మ, రామాంజనేయులు, పద్మావతి, వెంకటలక్ష్మమ్మ, వెంకటరమణ, రంగమ్మ, నాగలక్ష్మి, లక్ష్మమ్మ పార్టీలో చేరారు. పల్లె మాట్లాడుతూ గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. 193 చెరువులకు నీళ్లు ఇవ్వడమే తొలి ప్రాధాన్యత అన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామ న్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాసులు, మండల కన్వీనర్ జయచంద్ర, పీట్ల సుధాకర్, కృష్ణ మూర్తి, జాకీర్, శ్రీరాములునాయుడు, వెంకటేష్, చాంద్‌బాషా, పీరా, రాజు, జనార్దన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఇర్ఫాన్, ముసలరెడ్డి, రాజారెడ్డి, హారున్, కొండే ఈశ్వరయ్య, గంగాధర్, బాబా, కరుణాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సురేష్, చంద్ర, సుధాకర్, జనసేన నాయకులు మేకల ఈశ్వర్, సతీష్, శంకర్, దివాకర్‌రెడ్డి, చంద్ర, ఇర్షాద్ పాల్గొన్నారు.

యశోదమ్మ గెలుపునకు సైనికుల్లా పని చేస్తాం : జనసేన

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కూటమి అభ్యర్థి యశోదమ్మతో జనసేన నాయకులు

సైనికుల్లా పని చేసి కూటమి అభ్యర్థి కందికుంట యశోద మ్మను అత్యధిక మెజారిటీతో గెలిపి స్తామని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం పట్టణంలో యశోదమ్మతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలపై అఘాయి త్యాలు, కులాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. వాటిపై ప్రశ్నించిన వారిపై పోలీసులను అడ్డం పెట్టు కొని అక్రమ కేసులు బనాయించా రన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. మద్యపాన నిషేధం, ఏటా జాబ్ క్యాలెండర్ అమలు చేయలేదన్నారు. సిపిఎస్ రద్దు, పోలవరం ప్రాజెక్టు పూర్తి, ప్రత్యేక హోదా అంశాల్లో మాట తప్పారన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఎక్కడా ఒక కిలోమీటర్ రోడ్డు కూడా వేయించలేదన్నారు. మతాలు, కులాల పేరుతో కదిరి ప్రజల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు చిల్లా మహేష్, సాకే రవికుమార్, భూక్యా రవీందర్ నాయక్, పట్టణ అధ్యక్షులు కాయల చలపతి, ఉపాధ్యక్షులు లక్ష్మణ కుటాల, ప్రధాన కార్యదర్శులు వానిల్లి అంజిబాబు, గుంతా ప్రతాప్, కార్యదర్శులు గంగాధర్, సాయి ప్రియ, ఐటి వింగ్ కోఆర్డినేటర్ పొరకల రాజేంద్రప్రసాద్, బ్లూ మూన్ స్కూల్స్ అధినేత మంచి శివ శంకర్ పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి సవితకు బ్రహ్మరథం

సోమందేపల్లి : పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత శనివారం నాగినేనిచెరువు, తండా, భూసయ్య గారిపల్లి, వెలగమాకలపల్లి, గుడిపల్లి తదితర గ్రామాల్లో ఆత్మీయ పలకరింపు పర్యటన చేపట్టారు. గ్రామాల్లో ప్రజలు ఆమెపై పూలవర్షం కురిపిస్తూ గజమాలలతో స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామాలు మురికివాడల్లా తయారయ్యాయని, అభివృద్ధి శూన్యమన్నారు. చంద్రబాబు తీసుకొచ్చిన కియా పరిశ్రమతో ప్రతి గ్రామంలో అనేక మంది యువకులు కియాతో పాటు అనుబంధ పరిశ్రమల్లో ఉద్యోగాల్లో చేరారన్నారు. వైసిపి ఎమ్మెల్యే శంకరనారాయణపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో జగన్ మరో వలస పక్షిని తీసుకొచ్చారని ఆమెను గెలిపిస్తే ప్రజలను కొల్లగొట్టి మరో దగ్గరకు వలస పోతుందన్నారు. మా నాన్న పూల రామచంద్రరెడ్డి ప్రతి గ్రామంలో అన్ని వసతులు కల్పించారని ఆయనను ఆదర్శంగా తీసుకొని పని చేస్తానని, గెలిపించాలని కోరారు. చెరువు తండాలో సుమారు 60 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో డివి ఆంజనేయులు, అశ్వత్థప్ప, కొలింపల్లి శ్రీనివాసరెడ్డి, బేల్దారి చంద్రబాను, కీర్తి, వెంకటరమణ, భూసయ్యగారిపల్లి నాగరాజు, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

రాజీ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం

పుట్టపర్తి రూరల్ : రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన శనివారం పుట్టపర్తిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 149 కేసులను పరిష్కరించారు. జడ్జి రాకేష్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులకు పరిష్కారం చూపుతున్నామన్నారు. తద్వారా వారి మధ్య సత్సంబంధాలు ఏర్పడి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు.లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, లెక్కల యదుభూషణ్, కృష్ణమూర్తి, ఇందిర, హరికృష్ణగౌడ, నాగేంద్ర, పూజారి ప్రసాద్, శ్రీనివాసులు, మౌనిక, క్లర్క్ మారుతి, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

గాండ్లపెంట : ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకూ జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒ కృష్ణానాయక్ తెలిపారు. గాండ్లపెంటలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక జడ్పీ హైస్కూల్, కెజిబి పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, వెలుతురు, తదితర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు, వ్యాపార సముదాయాలు తెరవకూడదన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో ఎక్కడా మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలని డిఎంహెచ్ఒ ఎస్వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డిఐఒ) డాక్టర్ డి.కృష్ణయ్య మాత శిశు మరణాల పై జిల్లా సబ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఐఒ మాట్లాడుతూ ఏ తల్లి జన్మనిస్తూ మరణించకూడదని, ఏ బిడ్డ జన్మిస్తూ మరణించకూడదని పిలుపు నిచ్చారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజువాణి పలు సూచనలు, సలహాలు ఇచ్చా రు. సమావేశంలో పీడియాట్రిషియన్ డా. జోవెల్ వెస్లీ, గైనకాలజిస్ట్ మహబూ బ్‌చాంద్, డిపిహెచ్ఎన్ఒ వీరమ్మ, ఐసిడిఎస్ పిడి లక్ష్మి కుమారి, వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఆరోగ్య, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ

ధర్మవరం టౌన్ : మున్సిపాలిటీలో పని చేస్తున్న 50 మంది పారిశుధ్య కార్మికులకు శనివారం రెడ్స్, యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట ఉషోదయ స్కూల్‌లో మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, ఫౌండేషన్ ప్రెసిడెంట్ శీలా నాగేంద్ర శానిటరీ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర, ఛార్టెడ్ ప్రెసిడెంట్ పోలా ప్రభాకర్, సభ్యులు చాంద్ బాషా, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థుల ఎంపికపై హర్షం

కొత్తచెరువు : హిందూపురం పార్లమెంట్ వైసిపి అభ్యర్థిగా శాంతమ్మ ను, పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా డి.శ్రీధర్ రెడ్డిని అధిష్టానం ప్రకటించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ సిఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు అధికంగా కేటాయించారన్నారు. వీరి గెలుపు కోసం సమిష్టిగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రాధా నాగరాజు, నాయకులు వాల్మీకి శంకర్, ఎల్లప్ప, మధు, అశోక్, మన్నేరు ప్రసాద్, విశ్వనాథ్, మారుతి, కృష్ణమూర్తి, శివ, పూజారి పెద్దన్న పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘం పరిధిలో 2000 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను మున్సిపల్ కార్యాలయం, వివిధ వార్డుల సచివాలయాల్లో వైసిపి నాయకులు వేణురెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, ఆయా వార్డు కౌన్సిలర్లు శనివారం నాడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ దేనన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు రోషనాలి, నాగేంద్రబాబు, వార్డు ఇన్‌ఛార్జి మల్లిక భాను, టౌన్ క్లస్టర్ 1 కన్వీనర్ భాను, నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా అనురాధ

హిందూపురం : చిన్నమార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎన్.అనురాధ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనురాధ హిందీ జూనియర్ లెక్చరర్‌గా మడకశిర, లేపాక్షి, హిందూపురం ప్రభు త్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహించారు. హిందూపురంలో అధ్యాపక రాలిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితుల య్యారు. ఆమెకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం

బత్తలపల్లి : వేసవిలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చడం అభినందనీయమని ఎస్ఐ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఎస్ఐ ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ వేసవిలో ఆహారం లేకపోయినా నీటిని అధికంగా తాగాలన్నారు. మరికొందరు ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు. చలివేంద్రంలో మినరల్ వాటర్‌తో పాటు చల్లని మజ్జిగ కూడా ఉంచారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ జనార్దన్, హోంగార్డ్ ప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ సంక్షేమ పథకాలతోనే విజయం

ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ

హిందూపురం : వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే వచ్చే లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపిస్తాయని హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. వైసిపి హిందూపురం అభ్యర్థిగా తనను ఎంపిక చేయడంపై ఆమె జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శనివారం పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోయ కులానికి చెందిన తనను పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. హిందూపురం పార్లమెంట్ ఎన్నికల్లో వైసిపి జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశం లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శాంతమ్మ